క్లుప్తంగా

ట్రెక్కింగ్ క్యాంప్‌నకు ఎన్‌సీసీ గరల్స్ క్యాడెట్స్



నరసరావుపేటరూరల్: గుంటూరు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా గరల్స్ ట్రెక్కింగ్ క్యాంప్‌లో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 18 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొంటున్నట్టు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు శనివారం తెలిపారు. ఈనెల 16నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్న క్యాంప్‌నకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 510 మంది గరల్స్ క్యాడెట్స్ పాల్గొంటున్నట్టు తెలిపారు. క్యాంప్‌లో భాగంగా కొండపల్లి కోట,ఫిరంగిపురం కొండ, కొండపల్లి గృహలు, ఉప్పలపాడు బర్డ్స్ సెంచరీ ప్రాంతాలలో క్యాడెట్స్‌కు ఉత్తమ శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ట్రెక్కింగ్ క్యాంప్ ద్వారా శారీరక సామర్థ్యం, ధైర్యసాహసాలతో పాటు ప్రాంతీయ, సాంస్కృతిక వారసత్వం గుర్తించి తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. క్యాంప్‌లో పాల్గొన్న క్యాడెట్స్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

రైల్వే బ్రిడ్జిపై నూతన స్టీల్ గడ్డర్లు పనులు



శావల్యాపురం: శావల్యాపురం కొంకెరు వాగుపై బ్రిటిష్ వారు హయాంలో నిర్మించిన రైల్వే బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన స్టీల్ గడ్డర్లు కాల పరిమితి పూర్తి కావటంతో నూతన స్టీల్ గడ్డర్లు పనులు రైల్వే అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఇందుకుగాను 200 టన్నుల సామర్థ్యం కలిగిన నాలుగు క్రేన్లు ద్వారా స్టీల్ గడ్డర్లు అమర్చడానికి కావల్సిన కొంకెరు వాగు ప్లాట్‌ఫాంను కొండరాళ్ళతో సిద్ధం చేస్తున్నారు. స్టీల్ గడ్డర్లు అమర్చే సమయంలో భూమి కుంగిపోకుండా కొండరాళ్లతో పనులు చేస్తున్నారు. ఈబ్రిడ్జిపై ఎనిమిది స్టీల్ గడ్డర్లు అమర్చే విధంగా భారీ యంత్ర పరికరాలు పాక్లయినర్ ద్వారా శరవేగంగా చేస్తున్నారు. నూతన స్టీల్‌గడ్డర్లు కాలపరిమితి 60 సంవత్సరాలు వరకు ఉంటుందన్నారు. జనవరి 31న స్టీల్ గడ్డర్లు పనులు ప్రారంభం అవుతాయని, మొదట దశలో మూడు గంటల వ్యవధిలో నాలుగు స్టీల్ గడ్డర్లు పనులు చేస్తారని, తదుపరి ఫిబ్రవరి 1వ మిగిలిన నాలుగు స్టీల్ గడ్డర్లు అమర్చే పనులు పూర్తి అవుతాయని రైల్వే అధికారులు వెల్లడించారు. ఒక్కో స్టీల్ గడ్డర్ 20 టన్నులు బరువు ఉంటుంది. రైల్వే రాకపోకలకు అంతరాయం లేకుండా ముందు జాగ్రత్తగా రైల్వే అధికారులు ఏర్పాట్లు చేశారు.

జమీర్ ఆరోపణల్లో వాస్తవంలేదు

విలేకర్ల సమావేశంలో డీఎస్పీ నాగేశ్వరరావు



నరసరావుపేట: పట్టణానికి చెందిన షారూఖ్, ఫరూఖ్ అనే ఇద్దరు వ్యక్తులు తమ కుమారుడు లింగా అలియాస్ జమీర్‌ను గంజాయి అమ్మమని, దొంగతనాలు చేయమని బెదిరిస్తున్నారంటూ జమీర్ తల్లి మాబూలా చేస్తున్న ఆరోపణల్లో ఎటువంటి వాస్తవంలేదని డీఎస్పీ కె.నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం రాత్రి డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. తన కుమారుడిని వారు బెదిరిస్తున్నట్లుగా తనకు, జిల్లా ఎస్పీకి, మీడియాకు జమీర్ తల్లి చెప్పిందన్నారు. తాము విచారణ చేశామన్నారు. వాస్తవానికి షేక్ ఖాదర్, షేక్ సుభాని, జమీర్ గంజాయి అమ్ముతుంటే పోలీసులు అరెస్టుచేసి జైలుకు పంపారన్నారు. దీనిపై షారుఖ్, ఫారూఖ్‌లే పోలీసులకు సమాచారం ఇచ్చి వారిని పట్టించారనే అనుమానంతో గత నెల 31వ తేదీ రాత్రి వరవకట్టలో వీరి మధ్య గొడవ జరిగిందన్నారు. దీనీపై ఇరువర్గాలపై కౌంటర్ కేసులు నమోదయ్యాయన్నారు. దీనిపై షారుఖ్, ఫారూఖ్‌ల తల్లితండ్రులు వచ్చి వీరిని ప్రశ్నించారన్నారు. ఈ కేసులో షారూఖ్, ఫారూఖ్‌లను అరెస్టు చేశామన్నారు. వాళ్లని 107 బైండోవర్ చేయటం జరిగిందన్నారు. జమీర్‌ను మాత్రం అరెస్టు చేయలేదు అన్నారు. జమీర్ తనపై నమోదైన కేసుల్లోనుంచి బయటపడేందుకు ఈ ఆరోపణలు చేస్తున్నట్లుగా అర్థమౌతుందన్నారు. తప్పులు చేయని నేరస్తులైనా సరే రక్షించాల్సిన బాధ్యత పోలీసులకు ఉందన్నారు. వీరు అందరిపైనా గతంలో కేసులు ఉన్నాయని. జమీర్ చెప్పే దాంట్లో వాస్తవం ఉంటే ముద్దాయిలపై చర్య తీసుకుంటామని డీఎస్పీ చెప్పారు. జమీర్‌పై ఒక ఎలక్షన్ కేసు, డెకాయిటీకేసు, ప్రస్తుత కేసు మొత్తం మూడు ఉన్నాయని అన్నారు. ఈ రెండు కేసులలో ఉన్న వారిపై రౌడీ షీట్లు తెరుస్తామని పేర్కొన్నారు. ఈరెండు కేసులలో మొత్తం ఆరుగురు ముద్దాయిలు ఉన్నారని,షారుఖ్ పై 2023లో గాయపర్చిన కేసులు ఉన్నాయని, తర్వాత గాని ముందు గాని లేవు అన్నారు. అదే విధంగా ఖాదర్‌వలీపై ఎనిమిది కేసులు, సుభానిపై మూడు కేసులు, వరవకట్ట బాబుపై చాలా కేసులు ఉన్నాయని చెప్పారు. వారిద్దరి మధ్య మనస్పర్ధలు ఉండటం వల్ల దానిపై ప్రతీకారం తీర్చుకోవటానికి చేసిన ప్రయత్నంలో భాగమే ఈ ఆరోపణలని డీఎస్పీ వివరించారు.

అంతా నష్టం ఎంతో కష్టం



- ఎగుమతులు లేక మిర్చి రైతు విలవిల
- పెరిగిన పెట్టుబడి, తగ్గిన దిగుబడి
- ఎకరాకు రమారమి రూ.1 లక్ష మేర నష్టం

మిరప సాగులో గుంటూరు ప్రాంత రైతులు ఎప్పుడూ ముందే ఉంటారు. ప్రకృతి కన్నెర్ర చేసినా, విత్తనాలు మోసం చేసినా, పురుగు మందులు నకిలీవి అని తేలినా సాగు చేయడానికి ఎప్పుడూ కాడి దించని కర్షకులు సమృద్ధిగా ఉన్న పరగణా గుంటూరు. అలాంటి ఈ సీమలో ఆరుగాలం కష్టపడి ఫలసాయం దక్కించుకున్న రైతన్నకు ఇవాళ ఎగుమతులు రాక బిత్తర చూపులు చూస్తున్నాడు. దీనికి ప్రధాన కారణం ధరలు పతనం కావడమే.



గణపవరం కల్లంలో ఆరబోసిన మిర్చి

నాదెండ్ల: ఈ ఏడాది మిర్చి ధరలు పతనమవటంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. గతేడాదికి ఈ ఏడాదికి ధరల్లో భారీ వ్యత్యాసం ఉండటంతో కోల్డ్ స్టోరేజీలో ఉంచిన రైతులు భారీగా నష్టపోతున్నారు. ఒక పక్క వాతావరణంలో మార్పుల కారణంగా తెగుళ్ళు, పెరిగిన వ్యవసాయ ఖర్చులతో భారీగా పెట్టుబడి పెరిగింది. గతేడాదికన్నా ఈ ఏడాది సగానికి సగం సాగు తగ్గింది. మండలంలో 25 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, గతేడాది 4400 ఎకరాల్లో సాగు కాగా, ఈ ఏడాది కేవలం 2200 హెక్టార్లలో మాత్రమే సాగైంది. వ్యవసాయ ఖర్చులు, ఆరుతడులు, కూలి కలిపి గతేడాది ఎకరాకు రూ.1 లక్ష నుంచి రూ.1.50 లక్షలు కాగా, ఈ ఏడాది రూ.2.50 లక్షల వరకూ పెరిగింది.

ధరలు పతనం

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మిర్చి ధరలు భారీగా పతనమయ్యాయి. తేజ రకం ధర గతేడాది కనిష్టంగా రూ.18 వేలు – గరిష్టంగా రూ.22 వేలు పలికింది. ఇదేరకం ప్రస్తుతం రూ.12 వేల నుంచి రూ.15 వేలు మాత్రమే పలుకుతోంది. మిగిలిన రకాలైన నెం.5 గతేడాది రూ.15–20 వేలు కాగా, ప్రస్తుతం రూ.12–19 వేలు మాత్రమే పలుకుతోంది. నాటు రకాలైన 34, సూపర్10లు గతేడాది రూ.21–23 వేలు పలకగా, ప్రస్తుతం రూ.8–12 వేలు మాత్రమే పలుకుతోంది. తేజ తాలురకం గతేడాది రూ.10–13 వేలు, ఈ ఏడాది రూ.6–9 వేలు మాత్రమే పలుకుతోంది. నాటు రకాలైతే రూ.5–9 వేలు కాగా, ప్రస్తుతం రూ.3–5 వేలు మాత్రమే పలుకుతోంది. సీడ్ బ్యాడిగి రకాలైతే గతేడాది రూ.12–15 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.8–12 వేలు మాత్రమే పలుకుతోంది. తెగుళ్ల కారణంగా దిగుబడులు భారీగా తగ్గా యి.

గతేడాది ఎకరాకు 20–30 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈ ఏడాది 20–25 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. జెమిని వైరస్, బొబ్బర తెగులు కారణంగా కొంత మంది రైతులు ఇప్పటికే పొలాలు దున్నేసి ఇతర పంటలు సాగు చేశారు. ప్రస్తుతం శనగ, పొగాకు, పశుగ్రాసం సాగుకు మళ్ళారు.

నిల్వ చేసిన వారికి భారీ నష్టం

గతేడాది మిర్చి పంట కొనుగోలు చేసి కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచిన వ్యాపారులు, రైతులు ధరల పతనంతో భారీగా నష్టపోయారు. ధరలు పెరుగుతాయన్న ఆశతో కోల్డ్‌స్టోరేజీలో భారీగా నిల్వ చేశారు. గతంలో లాభాలు ఆర్జించిన వ్యాపారులు ప్రస్తుతం నష్టాల పాలవటంతో లబోదిబోమంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో మిర్చికి డిమాండ్ తగ్గటంతో ఎగుమతులు లేక ధరలు తగ్గాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఎకరాకు రూ.లక్ష నష్టం



ఈ ఏడాది రెండెకరాల్లో మిర్చి సాగు చేశా. ఎకరాకు రూ.2 లక్షలకు పైగా ఖర్చయింది. ప్రస్తుతం మిర్చి కోతలు సాగుతున్నాయి. ఈ ఏడాది ఎర్రనల్లి తెగులుతో దిగుబడి తగ్గింది. ఎకరాకు 10 క్వింటాళ్లు మించి వచ్చే పరిస్థితి లేదు. గతేడాది కన్నా ఈ ఏడాది రేట్లు తగ్గాయి.

–తొండాపు వెంకటేశ్వర్లు, మిర్చి రైతు, గణపవరం.

పెట్టుబడి పెరిగింది



ఎకరంన్నర పొలాన్ని కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశా. నేను, నా భార్య ఇరువురమూ పొలం పనులు చేసుకోవటంతో కొంతమేర కూలీ ఖర్చులు తగ్గాయి. ఎకరాకు రూ.1.50 లక్షల వరకూ పెట్టుబడి అయింది. ఈ ఏడాది సాగు ఖర్చులు పెరిగాయి. ఈదఫా ఎకరాకు రూ.50 వేలు పైగా నష్టం తప్పేలా లేదు. –పమిడి శ్రీనివాసరావు, మిర్చి రైతు, గణపవరం.

దిగుబడి తగ్గింది



రెండెకరాల్లో మిర్చి సాగు చేశా. ఇప్పటి వరకూ కౌలుతో కలిపి రూ.2 లక్షలకు పైగా ఖర్చయింది. గతేడాది ఎకరాకు 20 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చింది. ఈ ఏడాది తెగుళ్లు అకాల వర్షంతో సగానికి సగం దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

–బొప్పూడి శ్రీనివాసరావు, మిర్చి రైతు, గణపవరం.

రేపటి నుంచి పశువైద్య ఆరోగ్య శిబిరాలు

యడ్లపాడు: రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత పశు వైద్య ఆరోగ్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్న యడ్లపాడు మండలం ఏడీ రాధాకృష్ణ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి 31వరకు మండలం పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉచిత పశువైద్య ఆరోగ్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆయా శిబరాల్లో అనారోగ్యంతో ఉన్న పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే దూడలు, గొర్రెలు, మేకలు, గేదేలకు నట్టల మందు ఇవ్వడం , టీకాలు వేయడంతో పాటు ఎద ఇంజక్షన్లు, చూడి పరీక్షల నిర్వహణ వంటి అన్ని రకాల వైద్య పరీక్షలు, చికిత్సలు అందించనున్నట్లు వెల్లడించారు. కావున మండలం పరిధిలోని పశుపోషకులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



చిలకలూరిపేట: ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కేఎల్ రావు చెప్పారు. 36వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థల వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకున్నా, 60 సంవత్సరాలు దాటిన వారు డ్రైవింగ్ చేసినా మోటార్ వాహనాల చట్టం ప్రకారం రూ. 10 వేలు జరిమానా విధించటం జరుగుతుందన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపరాదని చెప్పారు. నిబంధనలు పాటించని వారిపై జరిమానా విధించటం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే ఆరునెలల వరకు జైలు శిక్ష విధించబడుతుందన్నారు. కార్యక్రమంలో వాహన డ్రైవర్లు, ట్రాన్స్‌పోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో స్వచ్ఛ దివస్ కార్యక్రమం

నరసరావుపేట: రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో శనివారం అధికార గణం తలమునకలైంది. మున్సిపల్ అధికారులు ఆరోవార్డు బాబాపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. చిలకలూరిపేట ఫ్లైఓవర్ పక్కనే ఉన్న పెట్రోలు బంకు నుంచి హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వరకు చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. పాల్గొన్న వారిచేత ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ ఎం.జస్వంతరావు, డీఈ రఫీ, మున్సిపల్ రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, శానిటరీ ఇనస్పెక్టర్లు, మునసిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ (నూజెండ్ల): మండలంలోని జంగాలపల్లి గ్రామసచివాలయ పరిధిలో స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటరు కంచర్ల సుబ్బారామయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛదివాస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి షేక్ రబ్బానీ పంచాయతీ కార్యదర్శులు చిట్టిబాబు, జానీబాష, ప్రభాకర్ రావు, నాగూర్‌లాలు, సందీప్ శాండిలియా, ఐటీసీ సెర్ప్ సిబ్బంది ఏసోబు, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇస్సప్పాలెంలో..

నరసరావుపేట రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే స్వచ్ఛ గ్రామాలు సాధ్యమవుతాయని ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి తెలిపారు. మండలంలోని ఇస్సప్పాలెంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నాగానంద్, ఎస్‌బీఎం ఎంఆర్‌సీ అయ్యపరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివనాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఎన్‌లో ...

నరసరావుపేట రూరల్: కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం స్వచ్ఛతా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది స్వచ్ఛతా కార్యక్రమంలో క్యాంపస్‌లోని చెత్తను, పిచ్చిమొక్కలను తొలగించారు. అనంతరం స్వచ్ఛతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సిహెచ్ శ్రీనివాసరావు, ఎన్‌సీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జీపీ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నరసరావుపేట ర్యాలీలో పాల్గొన్న నేతలు, అధికారులు, సిబ్బంది

బొల్లాపల్లిలో..

బొల్లాపల్లి : మండలంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్ నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీ కేంద్రాల్లో ఈ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. మండల కేంద్రమైన బొల్లాపల్లిలో తహసీల్దార్ ఏవీ సుధాకర్ పాల్గొని మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు తమ వంతు కృషి చేయాలని తెలిపారు. ప్రతినెలా 3వ శనివారం ప్రతి సచివాలయం పరిధిలో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంతో పాటు ప్రతి పంచాయతీలోని ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం ప్రభుత్వ నిబంధనలు మేరకు ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజాప్రతినిధుల సారథ్యంలో అధికారులు తప్పనిసరిగా చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛ ఆంధ్ర కోసం తన వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఏపీవో కె.రామారావు, పంచాయతీ కార్యదర్శి బోడ్డు యాకోబు,సచివాలయ సిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తలు మహిళా సంఘల్లోని సభ్యులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: స్వచ్ఛత, పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌లో భాగంగా శుభ్ర ప్రారంభం అనే కార్యక్రమాన్ని పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో రోడ్డు ఊడ్చి శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నపుడే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ప్రతి నెలా మూడో శనివారం మాస్ క్లీనింగ్ డ్రైవ్‌లో భాగంగా స్వఛ్ఛాంధ్ర మిషన్, స్వఛ్ఛదివస్ కార్యక్రమం నిర్వహించారు.

మండల కేంద్రమైన నాదెండ్లలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో స్వరూపరాణి, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద చెత్తాచెదారాలు ఊడ్చి శుభ్రం చేశారు. అనంతరం స్వఛ్ఛతా దివస్‌పై ప్రతిజ్ఞ నిర్వహించి ర్యాలీలో పాల్గొన్నారు.

రొంపిచర్లలో..

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో స్వచ్ఛాంధ్ర, దివస్ రెవెన్యూ, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ తహసీల్దార్ కార్యాలయం నుంచి బోస్ బొమ్మ, బొడ్డురాయి, బ్యాంకు, తులసీకోట సెంటర్ల గుండా చెరువుగట్టు సెంటర్ వరకు కొనసాగింది. దారిపొడవునా నినాదాలు చేశారు. గ్రామస్తులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బండి నిర్మల, ఎండీవో మాధ్యూబాబు, ఆర్ఐ కోటేశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌టీఆర్ వర్ధంతి

నరసరావుపేట: మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యాలయం , నియోజకవర్గ కార్యాలయం, పట్టణంలోని పల్నాడురోడ్డు, వినుకొండరోడ్డు, ఆరో వార్డు, స్టేషన్ రోడ్డు, రామిరెడ్డిపేట పాతసమితి కార్యాలయం, పలు ప్రదేశాల్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రక్తదాన శిబిరంలో పలువురు నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర డాక్టర్ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేల్పుల సింహాద్రి యాదవ్, రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్, రాష్ట్ర బులియన్ మార్చంట్ అధ్యక్షులు, టీడీపీ నాయకులు కపిలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మీరావలి, టీడీపీ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ తాళ్లూరి కుమార్, పట్టణ అధ్యక్షులు కడియాల రమేష్ బాబు, నరసరావుపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు వనమా సాంబశివరావు, మాజీ అధ్యక్షులు మాజేటి వెంకటేష్, నాయకులు వాసిరెడ్డి రవి, శాఖమూరి రామ్మూర్తి, కొట్టా కిరణ్, గొట్టిపాటి జనార్ధన్ బాబు, శారద, నాగజ్యోతి, షేక్ జిలాని మాలిక్, తెలుగు యువత, తెలుగు మహిళ, అన్ని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: ప్రజా సంక్షేమానికి అహర్నిశలు కృషి చేసిన ఎన్‌టీఆర్ చిరస్మరణీయుడని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని పలు ప్రాంతాలలో ఎన్‌టీఆర్ విగ్రహాలకు శనివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఎన్‌టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ,

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయే మహోన్నత వ్యక్తి నందమూరి తారక రామారావు అని పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఎన్‌టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని నరసరావుపేట రోడ్డు గంగినేని కళ్యాణమండపంలో శనివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని లెజెండరీ బ్లడ్ డొనేషన్ డ్రైవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

రెంటచింతల: తుమృకోటలో ఈ నెల 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తోట అమరలింగయ్య(60) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు. ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో లింగయ్య తీవ్రంగా గాయపడ్డాడు.

కార్పొరేట్ మాయలో పడొద్దు

- పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించండి
- ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

నరసరావుపేట: ప్రస్తుతం దేశం, రాష్ట్రంలో కార్పొరేట్లు రాజకీయాలను శాసిస్తున్నారని, వారి మాయలో పట్టభద్రులు పడకుండా ప్రజా సమస్యల పరిష్కారం కృషిచేసే పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. పట్టణంలోని కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో శనివారం సాయంత్రం ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావును బలపరుస్తూ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దీనికి యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు ఏ.భాగేశ్వరిదేవి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలలో గత ఎన్నికల సమయంలో 2.50 లక్షల మంది పట్టభద్రులు ఉండగా ప్రస్తుతం 3.46 లక్షల మంది ఓటర్లు ఉన్నారన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో 9వేలమంది పట్టభద్రుల ఓట్లు ఎనిమిది బూతుల పరిధిలో ఉన్నాయని, ఆయా బూత్‌లకు సంబంధించి నియోజకవర్గ స్థాయి నుంచి కమిటీలు వేసి పట్టభద్రులను కలిసి పీడీఎఫ్ అభ్యర్థుల నీతి, నిజాయితీ, నిబద్ధతను వివరించాలన్నారు.

టీడీపీ అభ్యర్థికి రాజకీయ, కుల, ధనబలం ఉంటే పీడీఎఫ్‌కు కేవలం ప్రజాబలం, కార్యకర్తల బలం ఉందన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యే అవకాశం ఉందన్నారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. రాధాకృష్ణ మాట్లాడుతూ పరిచయం అక్కరలేని పేరు కేఎస్ అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే తమ పరిధిలోని ప్రజాసంఘాల నాయకులు బాధ్యతగా పనిచేసే లక్ష్మణరావు గెలుపుకు కృషి చేయాలన్నారు. పల్నాడు బాలోత్సవం కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం మోహనరావు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయు) పల్నాడు జిల్లా అధ్యక్షురాలు కేపీ మెటిల్డాదేవి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, చిరు ఉద్యోగులు, కార్మిక, కర్షకుల పక్షాన నిలబడి ఆయా వర్గాల వాణిని తన వాణిగా చట్టసభలలో వినిపిస్తూ ఆయా వర్గాల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న లక్ష్మణరావు గెలుపు ఎంతో అవసరమని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న కేఎస్ లక్ష్మణరావు

పింఛనుదారుల ఇళ్లకు వైద్య బృందాలు



నాదెండ్ల: మండలంలో రెండు వైద్య బృందాలు శనివారం పర్యటించాయి. ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రతా పింఛన్లలో అనర్హులను గుర్తించి తొలగించే పనిలో భాగంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. మంచానికే పరిమితమైన 41 మంది పెన్షన్‌దారుల ఇండ్లకు వెళ్ళి క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వివరాలు నమోదు చేసుకున్నారు. ఎండుగుంపాలెం, తూబాడు మినహా గణపవరం, నాదెండ్ల, కనపర్రు, సాతులూరు, ఇర్లపాడు, చిరుమామిళ్ళ, గొరిజవోలు, సంకురాత్రిపాడు గ్రామాల్లో విజయవాడ జీజీహెచ్ ఆర్థోపెడిక్ నిపుణులు అయ్యప్పనాయుడు, గుంటూరు జీజీహెచ్ జనరల్ మెడిసిన్ లక్ష్మీకాంత్, గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.ప్రసాద్‌నాయక్, ఎంపీడీవో స్వరూపరాణి, తూబాడు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఉదయ్ బృందంగా పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో 41 మంది మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వం అందజేస్తున్న సామాజిక భద్రత పెన్షన్లలో అనర్హులు గుర్తింపుతో పాటు పునఃపరిశీలన కార్యక్రమం వైద్య ఆరోగ్య అధికారులు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టరు ఆదేశాలు మేరకు ప్రతినెలా రూ. 15 వేల పింఛను పొందుతున్న అనారోగ్య దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ పూర్తిస్థాయిలో మంచంలో ఉన్ననటువంటి లబ్ధిదారులను తనిఖీలు చేసినట్లు వైద్య బృందం సభ్యులు తెలిపారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 16 మంది లబ్ధిదారులు ఉండగా వైద్య బృందం సభ్యులు నేరుగా పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. వైద్య బృందం సభ్యులు విజయవాడ జీజీహెచ్ డాక్టరు వరుణ్‌కుమార్,గుంటూరు జిజిహెచ్ వైద్యులు రోశయ్య, సచివాలయ వేల్ఫేర్ సహాయకులు ఉన్నారు.